

రేపు సాలూరుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి

పార్వతీపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం జిల్లాకు రానున్నారు. ఆమె సాలూరులో పర్యటించనున్నట్లు తెలిసింది. పాచిపెంట మండలం పనుకువలసలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని కూడా పరిశీలించనున్నట్లు సమాచారం. ఉదయం 11 గంటల తర్వాత ఆమె సాలూరుకు చేరుకుంటారు. సాయంత్రం తిరిగి బయల్దేరి వెళ్లనున్నారు. కాగా కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులను ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా తెలిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

జోగారావు సార్.. కనిపించలేదా?

- జిల్లా కేంద్రంలో తాగునీటి కటకట
- ఏడాదైనా ప్రారంభం కాని పనులు
- పట్టించుకోని ఎమ్మెల్యే, అధికారులు



వాటర్ ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు (ఫైల్)

అక్కడ వైసీపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అధికారంలో ఉన్నదీ ఆయన పార్టీనే. జిల్లా కేంద్రంలోనే నివాసం ఉంటున్నారు. నిత్యం పట్టణంలోనే తిరుగుతుంటారు. కానీ ప్రజలు 'దాహమో.. రామచంద్రా' అని మొత్తుకుంటుంటే ఆయనకు వినపడనట్లు ఉంది. మహిళలే రోడ్డెక్కి ఆందోళనకు దిగినా ఫలితం లేదు. శీతాకాలంలోనే తాగునీటి సమస్య ఉందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం సంక్రాంతి పండగ సమీపిస్తోంది. అయినా ఎమ్మెల్యేగానీ, అధికారులుగానీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రంలో తాగునీటి సమస్య మరింత జటిలమైంది. శీతాకాలంలోనూ బిందెడు నీటి కోసం పట్టణవాసులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. పార్వతీపురంలో కొన్ని వార్డులకు మూడు రోజులకు ఒకసారి కొళాయిల ద్వారా తాగునీరు సరఫరా అవుతుండగా, మరికొన్ని ప్రాంతాలకు రోజుల తరబడి పూర్తిగా నీరందడం లేదు. శివారు కాలనీల్లో పరిస్థితి సరేసరి. వాటర్ ట్యాంకులు సైతం రెండు, మూడు రోజులకు ఒకసారే వస్తుండడంతో పట్టణవాసులు తాగునీటికి కటకటలాడుతున్నారు. 'దాహం తీర్చండయ్యా! అంటూ కొంతమంది మహిళలు ఏకంగా రోడ్డెక్కి ఆందోళన చేపట్టారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు పండగ సమీపిస్తుండగా ఇంతవరకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే .. వేసవిలో పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



ఎమ్మెల్యే జోగారావు



జిల్లాకేంద్రంలో 30 వార్డులు ఉండగా.. దాదాపు అన్ని ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. ప్రస్తుతం కొత్తవలస తదితర ప్రాంతాలకు వారం రోజులకు పైగా నీరందడం లేదు. పైపు లైన్లు లీకేజీ కారణంగా జిల్లా కేంద్రంలో రైతు బజార్ జంక్షన్ వద్ద గత పది రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. రోడ్డుపై ఆ నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించ లేని పరిస్థితి ఏర్పడింది. వాటర్ లీకేజీపై ఫిర్యాదు చేసినప్పటికీ మున్సిపల్ అధికారులు స్పందించకపోవడంతో స్థానికులు పెదవి విరుస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లా కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు సుమారు రూ.65 కోట్లు మంజూరు చేసినట్టు గతంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రకటించారు. అందులో రూ.35 కోట్లతో వాటర్ సోర్స్ పనులు చేపట్టాలని, పట్టణంలో పురాతన పైప్‌లైన్లు మార్చాలని నిర్ణయించారు. అయితే పార్వతీపురంతో పాటు విజయనగరం జిల్లా బొబ్బిలి తదితర మున్సిపాల్టీల్లో తాగునీటి అభివృద్ధి పనులను ఒక కాంట్రాక్టర్ ప్యాకేజీ రూపంలో దక్కించుకున్నన్నారు. సుమారు రూ. కోటి విలువైన పైపులు సిద్ధం చేసుకున్నప్పటికీ ఏడాది గడుస్తున్నా.. ఇంతవరకు పనులు ప్రారంభించకపోవడంపై జిల్లాకేంద్రవాసులు మండిపడు తున్నారు. వాస్తవంగా ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇంప్రూమెంట్ బ్యాంకు రుణంతో ఆ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ బ్యాంకు ద్వారా 70 శాతం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 30 శాతం నిధులు సమకూర్చాల్సి ఉంది. కాగా నిధులు మంజూరైతే... పనులు ఎందుకు చేపట్టడం లేదనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని జిల్లాకేంద్రవాసులు డిమాండ్ చేస్తున్నారు.

పనులు ప్రారంభించలేదు

జిల్లాకేంద్రంలో తాగునీటి పనులు ప్రారంభించని మాట వాస్తవమే. సుమారు రూ.కోటి విలువైన పైపులు సిద్ధంగా ఉన్నాయి. త్వరితగతిన ఆ పనులు చేపట్టి.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

\- కేజీఎన్ నరసింగరావు, డీపీహెచ్‌ఈవో, పార్వతీపురం

పోలింగ్ కేంద్రాల్లో

సౌకర్యాలకు చర్యలు

- నిశితంగా పాఠశాలల పరిశీలన
- డీఈవో ప్రేమ్‌కుమార్

గరుగుబిల్లి, జనవరి 11: ఎన్నికల దృష్ట్యా పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు గాను పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించనున్నట్లు డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో పాఠశాలలను నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. ఈ నెలాఖరుకు మౌలిక వసతుల పనులు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. దీనికి సంబంధించి ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, వంట గదులు, విద్యుత్ సౌకర్యంతో పాటు ఫర్నీచర్, ర్యాంపులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. దివ్యాంగులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. నాడు-నేడు రెండో విడత నిధులతో ఆయా పనులు చేపట్టాల్సి ఉందని స్పష్టం చేశారు. పంచాయతీల పరిధిలోని పాఠశాలలను ఎంఈవోలు పరిశీలించి వాటి వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. దీనిపై అలసత్వం వహించరాదని హెచ్చరించారు. అనంతరం ఎమ్మార్సీలో నమోదు చేసిన వాటిపై ఆరా తీశారు. ఈ పరిశీలనలో ఎంఈవో కె.కొండలరావు, ఏపీవో వై.శంకరరావు, సీఆర్‌ఈలు బి.రామకృష్ణ, శంకరరావు, వై.యశోద, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సన్నద్ధం

- 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది సిద్ధం
- 23 నుంచి చేయాలని నిర్ణయం

రాజాం, జనవరి 11: ఉమ్మడి జిల్లాలో 108, 104 ఉద్యోగులతో పాటు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది సమ్మెకు సన్నద్ధమవుతున్నారు. ఈ నెల 23 నుంచి సమ్మె చేయడానికి ఆరోగ్య శ్రీ సీఈవోకు నోటీసు అందించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమ్మెకు యూనియన్లు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. అందులో భాగంగా గురువారం నుంచి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. తొలుత 1902కు కాల్‌చేసి జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేస్తారు. 14న ప్రజాప్రతినిధులు, మంత్రులకు సామూహిక వినతిపత్రాలు అందిస్తారు. 16న సీఎంకు ఈమెయిల్స్ ద్వారా వినతులు పంపుతారు. 21 కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేపడతారు. 22న స్పందనలో వినతులు ఇవ్వడం చేస్తారు. ఆ రోజు సాయంత్రంలోగా ప్రభుత్వం నుంచి స్పందన లేకుంటే 23 నుంచి సమ్మెకు వెళ్లేందుకు ఆ మూడు విభాగాల వారు నిర్ణయించుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 108 వాహనాలు 45 ఉన్నాయి. వాటిలో 234 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. 104 వాహనాలు 77 ఉన్నాయి. వాటిలో 177 మంది విధులు నిర్వహిస్తున్నారు. విపక్ష నేతగా ఉన్నప్పుడు వీరందరిని కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తిస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చారు. అవసరమైతే ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏ నెలకు ఆనెల జీతాలు చెల్లిస్తామని చెప్పుకొచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఆ మాట మరిచారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వైద్య ఆరోగ్య శాఖ నియామకాల్లో 108 ఉద్యోగులకు వెయిటేజీ ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కూడా లేకుండా పోయింది. వైద్య ఆరోగ్య శాఖలో డీఎంఈలో మాత్రమే కాంట్రాక్ట్ పోస్టులను భర్తీ చేస్తున్నారు. దీంతో 108 ఉద్యోగుల విద్యార్హతలు పనికి రాకుండా పోతున్నాయి. ఈ నిబంధనలను సవరించి 108లో ఇఎంటీలుగా పని చేస్తున్న వారి సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే గత రెండు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉండిపోయాయి. అందుకే ఏ నెలకు ఆ నెల జీతాలు చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు..

ఈ నెల 23 నుంచి 108,104, తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్టు సమాచారం. అమరావతిలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు ఆర్టీసీ అధికారులు కీలక సమావేశం నిర్వహించారు. ఒక వేళ మూడు విభాగాల సిబ్బంది సమ్మెకు వెళితే వారి స్థానంలో ఆర్టీసీ సిబ్బందితో నడిచే ఏర్పాట్లు చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని విజయనగరం, ఎస్.కోట, సాలూరు, పార్వతీపురం ఆర్టీసీ డిపో అధికారులకు ఆదేశాలు వచ్చినట్టు తెలుస్తోంది.



విజయనగరంలో జాయింట్ కలెక్టరుకు సమ్మె నోటీసు అందజేస్తున్న యూనియన్ నాయకులు

సమ్మె నోటీసులిచ్చారు

జిల్లాలో 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది ఈ నెల 23 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు నోటీసులిచ్చారు. అత్యవసర సేవల దృష్ట్యా ఆ మూడు విభాగాల సిబ్బంది ఒక్కసారి ఆలోచించాలి. ఒకవేళ సమ్మె అనివార్యమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో సిద్ధంగా ఉన్నాం. ఆర్టీసీ, ఇతరత్రా శాఖల సేవలను వినియోగించాలని ప్రభుత్వం ఆదేశించింది.

\- మన్మథనాయుడు, 108,104 బాధ్యుడు, ఉమ్మడి జిల్లా

చెక్‌పోస్టులు సమర్థవంతంగా పనిచేయాలి

- కలెక్టర్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశం

పార్వతీపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెక్‌పోస్టులు సమర్థవంతంగా పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, ప్రాధాన్య భవనాలు, సురక్ష తదితర అంశాలపై సమీక్షించారు. ఎన్నికల నేపథ్యంలో వాటి పనితీరుపై దృష్టి సారించాలని, తాగునీరు, ఇతర సౌకర్యాల లభ్యతను పరిశీలించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాల కల్పనకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. 201 కేంద్రాల్లో ర్యాంప్‌లు, మరుగుదొడ్లు అవసరమని తెలిపారు. ఈ నెల 25 నాటికి మిగిలిన పనులు పూర్తిచేస్తామని చెప్పారు.

రోగ నిర్ధారణ పరీక్షలు చేయండి

- జిల్లా మలేరియా అధికారి జగన్మోహనరావు

కొమరాడ, జనవరి 11 : గ్రామాల్లో తప్పనిసరిగా రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలని జిల్లా మలేరియా అధికారి డి.జగన్మోహనరావు ఆదేశించారు. గురువారం ఆర్‌ఎల్ పురంలో హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రోజూ రోగులకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. రోగుల వ్యాధి లక్షణాలను స్పష్టం నమోదు చేయాలని సూచించారు. ఎంఎఫ్-9, ఎం-2 రికార్డుల్లో ఆరోగ్య కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చేపట్టిన బ్లడ్ శాంపిల్స్ వివరాలు, నివేదికలను పరిశీలించారు. నివేదికల్లో నెగిటివ్‌గా గుర్తించినప్పటికీ వ్యాధి లక్షణాలకు సరిపడే మందులు అందజేయాలని సూచించారు. అనంతరం మందులు, పరీక్షల కిట్లు పరిశీలించారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఏఎంవో సూర్యనారాయణ, పీహెచ్‌ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

సడలని దీక్ష

- పోరుబాటలోనే అంగన్‌వాడీలు
- 31వ రోజుకు సమ్మె
- జిల్లావ్యాప్తంగా నిరసనలు
- ప్రభుత్వ తీరుపై మండిపాటు
- ఎస్మా, నోటీసులకు భయపడేది లేదని వెల్లడి
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



కొమరాడ: పురుగు మందు డబ్బాలను చూపిస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



గరుగుబిల్లిలో ఒంటి కాలిపై నిల్చుని..



భామినిలో ధర్నా చేస్తూ..



సాలూరులో 31వ సంఖ్య రూపంలో కూర్చొని..

బెలగాం/పాలకొండ/గరుగుబిల్లి/కొమరాడ/భామిని/సాలూరు రూరల్, జనవరి 11: జిల్లాలో అంగన్‌వాడీలు అలుపెరగని పోరు కొనసాగిస్తున్నారు. సడలని దీక్షతో ఉద్యమిస్తున్నారు. సర్కారు మొండి వైఖరికి నిరసనగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని, హామీలు నెరవేర్చాలని కోరుతూ జిల్లాలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 31వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు గురువారం వారు జిల్లాలో వివిధ చోట్ల వినూత్నంగా నిరసన తెలిపారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్లు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు నిరసన దీక్ష కొన సాగించారు. ఈ సందర్భంగా ఎస్మా రద్దు చేయాలని వారు నినదించారు. నెలరోజులకు పైగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. తమపై ఇంత నిర్లక్ష్యం తగునా? అంటూ ప్రశ్నించారు. షోకాజ్ నోటీసులకు భయపడేది లేదన్నారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటం ఆగదని, రానున్న రోజుల్లో సమ్మె మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. పాలకొండ సమ్మె శిబిరంలో నిద్రపోతూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ప్రభుత్వం నిద్ర లేవాలని డిమాండ్ చేశారు. గరుగుబిల్లిలో ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించండి లేదా ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రభుత్వం అనుమతించాలని కొమరాడలో అంగన్‌వాడీలు పురుగు మందు డబ్బాలతో నిరసన తెలిపారు. జీవో నెంబరు-2 ఉపసంహరించాలని భామినిలో ధర్నా చేశారు. నోటీసులు అందించడం సరికాదని, తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు వెల్లడించారు. సాలూరులో రూరల్ అంగన్‌వాడీ కార్యకర్తలు 31 సంఖ్య రూపంలో కూర్చొని ఆందోళన వ్యక్తం చేశారు. సీతానగరంలో చెంపలు వేసుకుని, బలిజిపేటలో చెరువులో దిగి నిరసన ప్రదర్శన చేపట్టారు.



సీతానగరంలో చెంపలు వేసుకుంటూ..



పాలకొండలో నిద్రపోతూ ...



పార్వతీపురంలో నిరసన దీక్షలో అంగన్‌వాడీలు

షోకాజ్ నోటీసులు జారీ..

- పది రోజుల్లో సంజాయిషీ ఇవ్వకుంటే చర్యలు

గరుగుబిల్లి: సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలకు జిల్లా యంత్రాంగం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం సంబంధిత ప్రాజెక్టుల పరిధిలోని కేంద్రాలు, కార్యకర్తలకు వాటిని అందించాలని ఆదేశించారు. ప్రాజెక్టు పరిధిలోని సూపర్‌వైజర్లకు ఈ బాధ్యత అప్పగించారు. కార్యకర్తలు నోటీసులు తీసుకోకుండా నిరాకరిస్తే ఆయా గృహాలకు అందించాలని, దీంతో పాటు కేంద్రాల పరిధిలో నోటీసులు అందించాలని సూచించారు. అయితే నోటీసుల పంపిణీ బాధ్యతను మండల పరిషత్ కార్యాలయం సిబ్బందికి అప్పగించారు. సచివాలయాల వారీగా నోటీసులు అంటించే బాధ్యతను సచివాలయ కార్యదర్శులకు అప్పగించారు. పది రోజుల్లో నోటీసులకు సమాధానం ఇవ్వాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. అయితే అధికంగా కార్యకర్తలు నోటీసులను తీసుకొనేందుకు ముందుకు రాకపోవడంతో కేంద్రాల ఆవరణలోనే అతికించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. విధులకు రాకపోవడంతో ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించకూడదన్న అంశంపై సంజాయిషీ నోటీసులు జారీ చేశారు.



గొట్టివలస అంగన్‌వాడీ కేంద్రానికి నోటీసులు అంటిస్తున్న సిబ్బంది

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..

కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. బాధ్యతలను విస్మరించిన సిబ్బంది నోటీసు అందుకున్న తర్వాత పది రోజుల్లో సరైన సంజాయిషీ అందించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

\-సుగుణకుమారి, సీడీపీవో, కొమరాడ ప్రాజెక్టు

కలర్‌ఫుల్: రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు



హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు

కెనరా బ్యాంక్
केनरा बैंक
Canara Bank
A Government of India Undertaking
Together We Can
ఆంధ్రజ్యోతి
ABN
AIMS INSTITUTES
Peenya, Bangalore
+91 81500 01994
SWARGASEEMA SUKETANA
Ph: + 91 98490 12500



విజేతలు వీరే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

విజ్జీ స్టేడియంలో తైక్వాండో పోటీలు

విజయనగరం రూరల్: నగరంలోని విజ్జీ స్టేడియంలో గురువారం జూనియర్ విభాగంలో తైక్వాండో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఎంపికైన వారు ఈ నెల 20, 21 తేదీల్లో కర్నూలు జిల్లా నంద్యాలలో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాన్ని తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు ఎం.త్రినాథ్‌రావు, అనిల్‌కుమార్ శర్మ, టి.వినీష్, పి.రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

14,857 మందికి 'జగనన్న తోడు'

విజయనగరం (ఆంధ్రజ్యోతి): జగనన్న తోడు పథకం ద్వారా జిల్లాలో 14,857 మంది చిరు వ్యాపారులకు రూ.15.71 లక్షలు వడ్డీ లేని రుణాన్ని ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. జిల్లాలో ఈ పథకం కింద ఏడు విడతల్లో 1,34,867 మంది చిరు వ్యాపారులకు న్యాయం జరిగిందన్నారు. జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన తదితరులున్నారు.

రేపు రంగోలీ పోటీలు

విజయనగరం రింగురోడ్డు: తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఈ నెల 13న వాజీ ఛానల్ ఆధ్వర్యంలో ఆనంద గజపతి ఆడి టోరియంలో రంగోలీ పోటీలు నిర్వహించనున్నట్టు చానెల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు చెప్పారు. గురువారం వాజీ ఛానల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 28 ఏళ్లుగా రంగోలి పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పోటీల్లో విజయం సాధించిన వారికి రూ.4.50 లక్షల విలువైన బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీవీ నటి, గుండమ్మ కథ ఫేం పూజ హాజరవుతారని తెలిపారు.

అరిగిపాలెం రెవెన్యూలో సర్వే రాళ్లు

వేపాడ: అరిగిపాలెం రెవెన్యూ పరిధిలోని సింగరాయి, జగ్గయ్యపేట గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసిన అధికారులు సర్వే రాళ్ల ఏర్పాటులో తలమునకలై ఉన్నారు. ఈ గ్రామాల పరిధిలో సుమారు 497 ఎకరాలలో సర్వే పూర్తి చేసిన అధికారులు 620 సర్వే రాళ్లు వేయాల్సి ఉండన్నారు. ఇప్పటికి 200 రాళ్లు వేసినట్టు తెలిపారు. తహసీల్దార్‌ప్రసన్నకుమార్, సర్వేయర్ అప్పలనాయుడు, రీ సర్వే డీటీ అర్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలు సంతృప్తికరంగా లేవు

బొబ్బిలి: మున్సిపల్ కార్మికుల డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం ఇచ్చిన హామీలు సంతృప్తికరంగా లేవని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు అన్నారు. స్థానిక లక్ష్మీటాకీస్ జంక్షన్‌లో గురువారం కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రభు త్వంతో జరిపిన చర్చలను కార్మికులకు వివరించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. కార్మి కుల ప్రధానమైన డిమాండ్ ఉద్యోగాలను పర్మినెంట్ చే యాలన్నదేనని అన్నారు.

ప్రకృతి వ్యవసాయమే చేయాలి

లక్కవరపుకోట: రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయ విస్తరణ పెరగాలని వ్యవసాయ సబ్ డి విజన్ అధికారులు తెలిపారు. గురువారం మండల స మాఖ్యలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌డివిజన్ అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయ పంటలకు మంచి గిరాకీ ఉంటుందన్నారు. సేంద్రీయ ఎరువుల పంటల స్టాల్స్ పట్టణాల్లో వెలుస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత రైతులు పూర్తిగా రసాయన ఎరువులవాడకాన్ని మానివేయాలన్నారు. గ్రామ సమాఖ్య వివోలు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆనందరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీసీలు దగా పడ్డారు

● ప్రభుత్వ తీరుపై విరుచుకుపడిన టీడీపీ నాయకులు



పూసపాటిరేగ: మాట్లాడుతున్న బంగార్రాజు

పూసపాటిరేగ: వైసీపీ ప్రభుత్వం బీసీలపై సవతి తల్లి ప్రేమ ఒలకబోస్తోందని, బీసీలకు పెద్దపీట వేస్తానని చెప్పి అణగదొక్కే ప్రయత్నం చేస్తోందని టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. గురువారం రెల్లివలస గ్రామంలో టీడీపీ నాయకుడు మహంతి చిన్నంనాయుడు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తె లుగుదేశం హయాంలో బీసీల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఎత్తివేశారని ఆ రోపించారు. బీసీలు ఉన్న నియోజకవర్గాలకు చెందినవారిని దూరంగా ఉన్న నియోజ కవర్గాలకు మార్పు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పతి వాడ తమ్మినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి శంకరరావు, బ్రాహ్మణ సమితి కన్వీనరు ఇనుగంటి రాకేష్‌శర్మ, మండల నాయకులు ఇజ్జురోతు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ● **గంట్యాడ:** బీసీ విద్యార్థులకు సరైన ప్రోత్సాహకాలు అందక పోవడంతో ఇబ్బంది ప డుతున్నారని మాజీ ఎం ఎల్‌ఏ కేఏ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక బీఈడీ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుతో బీసీ విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బంది ప డుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి లేక.. కొత్త ఉద్యో గాలు రాక నిరాశలో ఉన్నారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలపై అరాచకం జరుగుతోందన్నారు. ఈనెల 10న బొబ్బిలిలో జరిగిన రా..కదలిరా సభను వి జయవంతం చేసిన కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. గజపతినగరం నియోజ కవర్గం నుంచి 20 వేల మంది కార్యకర్తలు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో మండల టీడీపీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, నాయకులు అల్లు విజయకుమార్, బూడి అప్పలనాయుడు, రంధి చినరామునాయుడు, రొంగళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ● **రాజాం:** వైసీపీ ప్రభుత్వ పాలనలో బీసీలు దగా పడ్డా రని తూర్పుకాపు కా ర్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు అన్నారు. గురు వారం రాజాం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బీసీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లా డారు. వైసీపీలో బీసీ నేతలకు, ప్రజలకు గౌరవం లేదన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం జగన్‌రెడ్డి బీసీలను అణచివేసే ప్రయత్నం చేశారే తప్ప బీసీల అభ్యు న్నతికి పాటుపడలేదన్నారు. అనంతరం బీసీ నాయకులు మాట్లాడు తూ బీసీలకు చెందిన దాదాపు 30 సంక్షేమ పథకాలు రద్దుచేశారన్నారు. రిజరేషన్లు , పదవులు బీసీలకు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. రాష్ట్రంలో బీసీలంతా ఉమ్మ డిగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. బొత్స వాసుదేవరావునాయుడు, సుమ ల వెంక ట మన్మథరావు, గురవాన నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

● **విజయనగరం రూరల్:** రాష్ట్రంలో బీసీలకు అవమానాలు తప్పితే.. వారి సంక్షేమం కోసం కృషి చేయడం లేదని టీడీపీ బీసీ సాధికారిత కమిటీ నాయకులు కంది మురళీనాయుడు, ముద్దాడ చంద్రశేఖర్, మామిడి దేవేంద్రనాథ్, కోండ్రు శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల పరిస్థితి దయనీయంగా మా రిందన్నారు. వైసీపీలో ఉన్న బీసీ ఎంపీలకు సైతం జగన్ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమైన విషయమన్నారు. రాష్ట్రంలో బీసీలను అణగదొక్కి జగన్ సామాజిక వర్గాన్ని ప్రోత్సహిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.



రాజాం: టీడీపీ నాయకులతో కొల్ల అప్పలనాయుడు



విజయనగరం: మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ప్రజల వద్దకు జయహో బీసీ వాహనం



వాహనం ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

విజయనగరం రూరల్: బీసీలు ఎదుర్కొంటున్న సమస్య లపై వారిలో చైతన్యం తీసుకొచ్చే లక్ష్యంతో సిద్ధం చేసిన జయహో బీసీ వాహనాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, విజయనగరం నియోజక వర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు గురువారం పార్టీ కార్యాలయంలో ప్రారంభించారు. టీడీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాలు, నగ రాలకూ ఈ వాహనం వెళ్తుంది. టీడీపీ నాయకుడు కంది మురళీ నాయుడు ఏర్పాటు చేసిన ఈ వాహనంలో నేతల బృందం పర్యటిస్తుంది.

కొడుకు అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

రాజాం రూరల్: తన కుమారుడు అంకిత్ మిశ్రా ఈనెల 9 నుంచి కనిపించడం లేదని మున్సిపాలిటీ పరిధిలోని వస్త్రపురికాలనీకి చెందిన రేఖామిశ్రా గురువారం రాత్రి రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ వాడడాన్ని తగ్గించాలని సూచించడంతో ఇంటినుంచి వెళ్లిపోయినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఎస్.ఐ. రవికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీలపై తప్పుగా మాట్లాడలేదు: శంబంగి

బొబ్బిలి: అంగన్‌వాడీల గురించి తప్పుగా మాట్లాడానంటూ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. గురువారం బొబ్బిలిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'బొబ్బిలి గర్జన' పేరుతో నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు తనపై చేసిన ఆరోపణలపై శంబంగి పైవిధంగా స్పందించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని గాయాలు

రాజాం రూరల్: మున్సిపాలిటి పరిధిలోని డోలపేటలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బొద్దూరు నారాయణరావును ఎదురుగా వేస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గురువారం జరిగిన ఈ ఘటనపై సీఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నోటీసులను తిరస్కరించిన అంగన్‌వాడీలు



బొబ్బిలిలో నోటీసులను తిరస్కరిస్తూ పోస్టల్ ఉద్యోగిని తిప్పి పంపుతున్న దృశ్యం

బొబ్బిలి, జనవరి 11: బొబ్బిలి పట్టణంలోని ఎన్టీఆర్ కూడలిలో అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమ్మె శిబిరానికి తీసుకొచ్చిన నోటీసులను వారంతా తిప్పి పంపారు. పోస్టల్ ఉద్యోగి గురువారం శిబిరం వద్దకు వచ్చి కార్యకర్తలకు, ఆయాలకు వ్యక్తిగతంగా పోస్టల్ రిజిస్టర్డ్ కవర్‌ను అందించాలని ప్రయత్నించారు. వాళ్లంతా నోటీసులు తీసుకునేది లేదని వెనక్కి పంపించేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు మాట్లాడుతూ ఈ నోటీసులన్నిటినీ తిరుగు టపాలో ప్రభుత్వానికే పంపాలని ఆ ఉద్యోగిని కోరారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలికంగా విరమణ



సంఘీభావం తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

విజయనగరం దాసన్నపేట: మున్సిపల్ కార్మికులు గురువారం నుంచి తాత్కాలికంగా స మ్మె విరమణ ఇస్తున్న ట్టు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు గురు వారం నగర పాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా యూనియన్ నాయకులు జగన్మోహన్ రావు మాట్లాడుతూ జీతం, హెల్త్ అలవెన్సు కలిపి రూ.21 వేలు, బేసిక్ వేతనం, డ్రైవర్లకు రూ.18,500 , ఆక్యుపెన్సీ హెల్త్ అలవెన్సు రూ.6 వేలు తదితర సమస్యలపై పరిశీలనకు కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించినందున తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు మురళి, నారాయణరావు, రాఘవ, సూరి, లక్ష్మి, వర లక్ష్మి, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



అప్పలనాయుడు

దత్తిరాజేరు, జనవరి 11: మండలంలోని గడసాం గ్రామంలో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. మృతుడు భార్య నారాయణమ్మ వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మజ్జి అప్పలనాయుడు(47) ఈనెల 7వ తేదీన తన పొలంలో వేసుకున్న సోలార్ ప్లాంటు వద్దకు వెళ్లాడు. అక్కడ అదే గ్రామానికి చెందిన మజ్జి వెంకటేష్‌కు, అప్పలనాయుడుకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సదరు వ్యక్తి అప్పలనాయుడుపై దాడి చేశాడు. అనంతరం 8వ తేదీ ఉదయం ఇంటి వద్ద కూడా ఇద్దరూ ఘర్షణ పడ్డారు. దీనిపై పెదమానాపురం స్టేషన్‌లో కంప్లైంట్ ఇవ్వగా ఇరువర్గాలను పోలీసు స్టేషన్‌కు పిలిచి మాట్లాడుతామని స్టేషన్ సిబ్బంది తెలిపారు. మూడు రోజులు గడుస్తున్నా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో మనస్థాపానికి గురైన మజ్జి అప్పారావు గురువారం తన మిరపతోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే గజపతినగరం సీహెచ్‌సీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనిపై పెదమానాపురం ఎస్ఐ శిరీషను వివరణ కోరగా స్టేషన్‌లో ఎవరూ లేరని, విజయవాడ బందోబస్తుకు వెళ్లడంతో గురువారం స్టేషన్‌కు రావాలని సూచించామన్నారు. ఇంతలోనే ఈ ఘటన చోటు చేసుకుందని తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి



వెంకటేష్

కొత్తవలస: ట్రాక్టర్ బోల్తాపడడంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్కవరపుకోట మండలం నిడిగట్టు గ్రామానికి చెందిన సారికి వెంకటేష్(23) ట్రాక్టర్ కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం మండలంలోని చినరావుపల్లి నుంచి లక్కవరపుకోట మండలం నిడిగట్టుకు వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా అదుపుతప్పడంతో రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి బోల్తాపడింది. ఈ ఘటనలో తొట్టెలో కూర్చుని ఉన్న వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ నడుపుతున్న సతీష్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. దీంతో మృతి చెందిన వెంకటేష్ కుటుంబానికి నష్టపరిహారం ఇచ్చేందుకు ట్రాక్టర్ యజమాని అయిన ఎల్‌కోట ఎంపీపీ శ్రీనివాసరావు అంగీకరించారు. మృతి చెందిన యువకుని బంధువు సారికి శంకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ సతీష్‌పై ఎస్ఐ దేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురువారం తరలించారు.

డ్రైవింగ్ స్కూల్ వాహనాలు సీజ్

విజయనగరం క్రైం: నిబంధనలకు విరుద్ధంగా సరైన అనుమతి పత్రాలు లేకుండా ఎస్‌కోటలో తిరుగుతున్న బాలాజీ డ్రైవింగ్ స్కూల్‌కి సంబంధించిన రెండు వాహనాలను సీజ్ చేసి ఏపీఎస్ఆర్టీసీ డిపోకు తరలించినట్టు ఉప రవాణాశాఖ కమిషనర్ రవీంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవింగ్ స్కూల్ యాజమానులు అనుమతి పత్రాలు కలిగి ఉండాలన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బాడంగి: మండలంలోని వీరసాగరం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను బాడంగి ఎస్ఐ జయంతి సిబ్బందితో కలిసి దాడిచేశారు. వారిని అరెస్టు చేసి, రూ.15,130లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

భార్యను చంపిన కేసులో యావజ్జీవ శిక్ష

సీతానగరం: భార్యను చంపిన కేసులో వ్యక్తికి యావజ్జీవ శిక్ష విధించారు. దీనికి సంబంధించి ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతానగరం మండలంలోని ఆర్.వెంకంపేట గ్రామానికి చెందిన జి.ఈశ్వరరావు 2018లో తన భార్యను హత్య చేసి పరారయ్యాడు. దీనిపై అప్పటి సీఐ డీఎండీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన న్యాయస్థానం నేరం రుజువు కావడంతో నిందితుడు ఈశ్వరరావుకు యావజ్జీవ శిక్షను న్యాయాధికారి దామోదర్ గురువారం విధించారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

రేగిడి: మండలంలో జాడపేటకు చెందిన వ్యక్తి 20 మద్యం సీసాలతో ఉంగరాడ వద్ద పట్టుబడినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా తనిఖీలు చేస్తుండగా నిందితుడి వద్ద సీసాలు పట్టుబడ్డాయని, అతడిని అరెస్టు చేసి పూచికత్తుపై విడుదల చేశామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

లక్కవరపుకోట: పేకాటాడుతున్న నలుగురిని పట్టుకొని అరెస్టు చేసినట్టు ఏఎస్ఐ గోవిందరావు తెలిపారు. గురువారం ఖాసాపేట పరిసరాల్లో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామని, ఇందులో 24,040 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుడి మృతి

ఉక్కు టౌన్‌షిప్ (విశాఖపట్నం), జనవరి 11: విశాఖలోని స్టీల్‌ప్లాంట్ యుటిలిటీస్ విభాగంలో నిర్వహణ పనులు చేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు గురువారం మృతి చెందినట్టు స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. యుటిలిటీస్ విభాగంలో రేష్మ ఎంటర్‌ప్రైజస్ సంస్థ తరఫున కాంట్రాక్టు కార్మికునిగా పని చేస్తున్న పి.రవికుమార్ (46) గురువారం కంప్రెషర్ యంత్రం వద్ద విధులు నిర్వహిస్తూ మధ్యలో విశ్రాంతి గదికి చేరుకున్నాడు. రవికుమార్ ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో సహచర కార్మికులు గదిలోకి వెళ్లి చూడగా ఆయన నోటి నుంచి నురగలు కక్కుతూ కనిపించడంతో ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే రవికుమార్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పెద్దవీధికి చెందిన రవికుమార్ ఉపాధి నిమిత్తం విశాఖ వచ్చి కుటుంబంతో సహా పెదగంట్యాడలో నివసిస్తున్నాడు. ఉక్కు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

● న్యాయవాదుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

పాలకొండ: ప్రజా వ్యతిరేక కొత్త భూచట్టమైన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2022ను తక్షణమే రద్దు చేయాలని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు గురువారం నిరసన దీక్ష చేపట్టారు. పాలకొండ బార్ అసోసియేషన్ గొర్లెల సత్యంనాయుడు, న్యాయవాదులు యు.మురళీమోహన్‌రావు, సీమల కృష్ణారావు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ప్యానెల్ అడ్వకేట్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నూతన భూ హక్కు చట్టం వల్ల రైతులు తమ భూములపై హక్కులను పూర్తిగా కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఈ చట్టం ప్రకారం భూ హక్కుదారులకు జిరాక్స్ కాపీలే మిగులుతాయన్నారు. ఈ నిరసనలో జగన్మోహన్‌రావు, ఎన్.మురళీకృష్ణ, ఎన్ని అఖిల్, ఎం.కిరణ్, అలజంగి శంకరరావు పాల్గొన్నారు.

విధుల్లోకి ఎస్ఎస్ఏ ఉద్యోగులు

సాలూరు రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు గురువారం ఎంఈవో కార్యాలయాల్లో విధుల్లో చేరారు. గత నెల 20 నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మె చేస్తున్నారు. 22 రోజులుగా వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్‌లో 18 విభాగాల్లో 1,311 మంది కాంట్రాక్ట్, 469 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 110 మంది సీఎం ఆర్టీ, 15 మంది ఎంఐఎస్‌లు, 15 మంది ఎల్డీఏలు, 247 కేజీబీవీ, 30 మంది ఐఈఆర్టీలు ఉన్నారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు వారంతా సమ్మె చేశారు. 22 రోజుల అనంతరం వీరి సమస్యలపై ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలించాయి. హెచ్ఆర్ పాలసీ కోసం కమిటీ నియమిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో పాటు వివిధ డిమాండ్లకు సానుకూలత వ్యక్తం చేయడంతో వారు సమ్మె విరమించారు.


విధుల్లో చేరిన సాలూరు ఎస్ఎస్ఏ ఉద్యోగులు

రంగనాథునికి పూలంగి సేవ

సాలూరు రూరల్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పెదకోమటిపేట రామాలయంలో గోదా రంగనాథ స్వామికి గురువారం పూలంగి సేవను వైభవంగా చేశారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గడ్డివాముతో ట్రాక్టర్ దగ్ధం

గజపతినగరం: జీలపేట గ్రామంలో గడ్డివాము లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగిలి కాలిపోయిన ఘటన గురువారం చోటుచేసుకుంది. అగ్నిమాపక కేంద్రాధికారి వరప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లంక కూర్మారావు ట్రాక్టర్‌తో వరి గడ్డి తరలిస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి గడ్డివాముతో పాటు ట్రాక్టరు కాలిపోయింది. దీంతో గ్రామస్థులు చేసిన ఫిర్యాదు మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి, మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు రూ.60 వేలు ఆర్థికంగా నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

గజపతినగరం: పురిటిపెంట గ్రామంలోగల ప్రభుత్వ మద్యం షాపు నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు దాడి చేసి 26 మద్యం సీసాలను పట్టుకున్నామని ట్రైనీ డీఎస్పీ మహీందర్ గురువారం తెలిపారు. పురిటిపెంట రైల్వే కాలనీకి చెందిన సుంకరి నారాయణరావు అక్రమంగా 26 మద్యం సీసాలను తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. అలాగే పురిటిపెంట ఎస్సీ కాలనీలో సారా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్టు అందిన సమాచారంతో దాడులు నిర్వహించి, గ్రామానికి చెందిన పైడిరాజు వద్ద 130 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితురాలిపై కేసు నమోదు చేశామన్నారు.

● **దత్తిరాజేరు:** కె.కృష్ణాపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరి నుంచి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని స్టేషన్ బూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ గురువారం తెలిపారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు.

గొల్లలపేటలో ప్రత్యేక వైద్య శిబిరం

బొండపల్లి: గొల్లలపేట గ్రామంలో పలువురు డయేరియా బారిన పడడంతో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ చల్లా చలంనాయుడు పరిశీలించారు. గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి, వైద్య పరీక్షలు నిర్వహించి, గ్రామస్థులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు. అలాగే కాలువల్లో పూడికతీతలు తీసే పనులను చేపడుతున్నట్టు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు తెలిపారు. కార్యక్రమం లో ఎంపీడీవో వైపీ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మిల్లర్లపై విచారణ

జామి: మండలంలోని మిల్లర్లు అధికంగా ధాన్యం ఇవ్వాలని రైతుల నుంచి డిమాండ్ చేస్తున్నట్టు అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీనిపై ఎస్‌డీసీ సుమబాల గురువారం జామి వ్యవసాయ శాఖ కార్యాలయంలో విచారణ చేపట్టారు. రైతుల నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈమేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి జీతాలు

రాజాం రూరల్: రాజాం మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న శాశ్వత, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాలలో గురువారం జీతాలు పడ్డాయి. మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు సెలవుపై వెళుతూ ఎవరికీ బాధ్యతలు అప్పగించని నేపథ్యంలో సుమారు 500 మంది సిబ్బందికి సంబంధించిన డిసెంబరు నెల జీతాల బిల్లులు పెట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. ఈ విషయాన్ని డిసెంబరు 29న 'ఆంధ్రజ్యోతి'లో 'ఒకటిన వేతనం కష్టమే' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కలెక్టర్ కార్యాలయ వర్గాలు విషయాన్ని మున్సిపల్ పరిపాలనా విభాగం (అమరావతి) దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో రాజాం మున్సిపాలిటీ మేనేజర్ ఎంవీ నాగరాజుకు ఇన్‌చార్జి కమిషనర్‌తో పాటు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ నాగరాజు మున్సిపల్ సిబ్బంది జీతాలకు సంబంధించి చర్యలు ప్రారంభించారు. ఫలితంగా సిబ్బందికి గురువారం జీతాలు అందాయి.

అభివృద్ధి పనుల పరిశీలన

రేగిడి: కందిశ పంచాయితీలో రూ.18 లక్షల అంచనా వ్యయంతో చేసిన ఆరు రకాల అభివృద్ధి పనులను జిల్లా క్వాలిటీ విభాగం డీఈఈ వెంకటాచలం, ఏఈ రామక్రిష్ణ గురువారం పరిశీలించారు. సీసీ రోడ్లు, డ్రైన్ల పనుల నాణ్యత, వాటికి వేసిన సిమెంట్, చిప్స్ పరిమాణాన్ని పరిశీలించి ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు వారు తెలిపారు. పనులపై వారు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు.

టీడీపీ హయాంలోనే బీసీల అభివృద్ధి

● మాజీ ఎమ్మెల్సీ జగదీష్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: టీడీపీ ప్రభుత్వ కాలంలోనే బీసీల అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. గురువారం పార్వతీపురంలోని ఆయన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. బీసీల జనాభా పెరుగుతున్నప్పటికీ బీసీలకు రిజర్వేషన్ శాతం పెరగడం లేదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం అసెంబ్లీ సీట్లు పెరగాల్సి ఉన్నప్పటికీ అటు వైపు చర్యలు తీసుకోకపోవడంతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు బీసీలు నడం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోలా వెంకటరావు, జి.రవికుమార్, అక్కేన శ్రీనివాసరావు, జాగాన రవిశంకర్, టి.వెంకటరమణ, బడే గౌరునాయుడు, కాపవరపు జనార్ధన్‌నాయుడు, రాజశేఖర్, గంగాడ రామ్మూర్తి, మాజీ విశ్వబ్రాహ్మణ రాష్ట్ర డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనను అంతం చేద్దాం


మాట్లాడుతున్న జయకృష్ణ

సీతంపేట: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పార్టీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. హడ్డుబంగి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. మ్యానిఫెస్టోలోని సూపర్‌సిక్స్ అంశాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని, వైసీపీ అరాచక పాలనకు అంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సవర తోటముఖలింగం, ఆర్.రంగనాథం, బిడ్డిక నీలయ్య, గంట సుధ, బిడ్డిక ఆనందరావు, మూటక భరత్‌రాజ్, మండంగి కుమార్, బిడ్డిక విశ్వనాథం, బిడ్డిక ప్రవీణ్, పువ్వల భాస్కర్‌రావు, బిడ్డిక ఉమాకాంత్ పాల్గొన్నారు.

బెదిరింపులకు భయపడేది లేదు

● 31వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

● ఎస్మా ప్రయోగం తగదు

జగన్ బెదిరింపులకు ఏ ఒక్క అంగన్‌వాడీ కార్యకర్త భయపడేది లేదని యూనియన్ నాయకులు అన్నారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె గురువారంతో 31వ రోజుకు చేరింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలను చులకనగా చూడడమే కాకుండా ఎస్మాను ఉపయోగించి అధికారుల ద్వారా నోటీసులు జారీ చేయించి, భయానక వాతావరణం కల్పిస్తుండడం తగదన్నారు. తమ హక్కుల సాధనకు పోరాటాలు చేస్తుంటే ఈ విధంగా వేధించడం తగదన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళన ఆపేది లేదన్నారు. (ఆంధ్రజ్యోతి బృందం)


సీతంపేట: నిరసన దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీలు

ఎస్మాను రద్దు చేయాలి

బెలగాం: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు శాంతియుతంగా నిరసన దీక్షలు చేస్తుంటే జీవో2 తెచ్చి ఎస్మా ప్రయోగించారని.. వెంటనే దాన్ని వెనక్కి తీసుకోవాలని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పార్వతీపురంలోని ఎన్జీవో హోంలో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీలు 31 రోజులుగా సమ్మె చేస్తుంటే సమస్యలు పరిష్కరించకుండా ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని అన్నారు. సంక్రాంతి తర్వాత సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు, సీపీఎం నాయకులు వై.మన్మథరావు, గొర్లి వెంకటరమణ, ఇందిర, గిరిజన సంఘ నాయకులు రంజిత్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

సమ్మె ఎందుకు విరమించాలి?

పార్వతీపురం టౌన్: తమకు ఏం న్యాయం జరిగిందని.. సమ్మె విరమించమంటారని ఇంజినీరింగ్ విభాగం కార్మికులు సంబంధిత అధికారులను ప్రశ్నించారు. గురువారం నుంచి పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగం కార్మికులు విధులకు హాజరవుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. పార్వతీపురం మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన కార్మికులు మాత్రం తమకు న్యాయం జరగలేదంటూ ఏఈ ఆనందరావు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్మికులతో పాటు సుమారు 15 రోజుల పాటు తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మెలో పాల్గొంటే తమకు అన్యాయం జరిగిందని వాపోయారు. పండుగను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఇబ్బందులు పెట్టకుండా విధులకు హాజరవుతామన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ త్వరలో మళ్లీల సమ్మెలోకి వెళ్తామని అధికారుల వద్ద స్పష్టం చేశారు.

జీవోలు వచ్చాకే సమ్మె విరమణ

పాలకొండ: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలపై జీవోలు వచ్చిన తర్వాతే పూర్తి స్థాయిలో సమ్మె విరమణ ఉంటుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణరావు తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతానికి ప్రజల ఇబ్బందులను, ప్రభుత్వ విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా సమ్మెను వాయిదా వేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.


పార్వతీపురం టౌన్: ఏఈ ఆనంద్‌కుమార్ వద్ద తమ ఆవేదన వ్యక్తం చేస్తున్న ఇంజినీరింగ్ విభాగం కార్మికులు


పాలకొండ: సమావేశమైన మున్సిపల్ కార్మికులు

'అమో ఒడిశా'లో అపశ్రుతి

● వేడి నూనె పడి ఇద్దరు విద్యార్థినులకు గాయాలు

ఒడిశా

రాయగడ: యువతను రాష్ట్ర ప్రగతిలో భాగస్వామ్యం చేసేందుకు 'అమో ఒడిశా - నవీన్ ఒడిశా' పేరిట బుధవారం స్థానిక ఐఏసీఆర్ సమీపంలోని మైదానం లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి సుమారు 17 వేలకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. భోజన సమయంలో జరిగిన తోపులాటలో ఇద్దరు విద్యార్థినులపై వంటలకు ఉప యోగించిన మరుగుతున్న నూనె పడింది. దీంతో వారికి సుమారు 30 శాతం మేరకు గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే కలెక్టర్ స్వధాదేవిసింగ్ స్పం దించి తగు చర్యలు తీసుకున్నారు. ఎక్కువగా గాయపడ్డ ఓ విద్యార్థినికి రూ.30వేలు, మరో విద్యార్థినికి రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందించారు. అధికారులు క్షతగాత్రులిద్దరినీ వెంటనే జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

కాంగ్రెస్ నిరసన

ఈ ఘటనకు నిరసనగా గురువారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పండా పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ఇందుకు కారణమైన అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితు ల చికిత్సకు అయ్యే ఖర్చంతా అధికారుల నుంచి వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అప్పలస్వామి, తదితర నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పండా, అప్పలస్వామి

బీజేపీ మహిళా మోర్చా ఫిర్యాదు

ఇదే విషయమై బీజేపీ మహిళా మోర్చా నాయకులు కలెక్టర్ స్వధాదేవి సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై వారం రోజులలోగా చర్యలు తీసుకోకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్.. విద్యార్థినుల చికిత్సకు అయ్యే ఖర్చంతా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు.

కిటకిటలాడిన సంతలు


భామిని: జనాలతో కిటకిటలాడుతున్న సంత


పార్వతీపురం టౌన్: వ్యవసాయ మార్కెట్ యార్డులో..

భామిని: సంక్రాంతి ముందు భామినిలో గురువారం నిర్వహించే సంత కిటకిటలాడింది. ఈ ప్రాంత ప్రజలు భారీ సంఖ్యలో సంతకు హాజరై తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేశారు. ఆదివాసీ గిరిజనులతో పాటు మైదాన ప్రాంతాల ప్రజలు రావడంతో సంత కిటకిటలాడింది.

● **పార్వతీపురం టౌన్:** పార్వతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో గొర్రెలు, మేకల సంత జరిగే ప్రాంతమంతా తిరునాళ్లను తలపించింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో గురువారం ఉదయం 6 గంటల నుంచి గొర్రెలు, మేకల సంత అమ్మకం, కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయింది. ఎన్నడూ లేని విధంగా సంతకు పార్వతీపురం మన్యం జిల్లాలోని వివిధ మండలాల నుంచే కాక, ఒడిశా రాష్ట్రంలోని గ్రామాల నుంచి అమ్మకం, కొనుగోలుదారులు రావడంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది.

కేంద్ర పథకాలపై అవగాహన

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహి స్తున్నట్టు మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు తెలిపారు. చినగు డబ గ్రామంలో పలు పథకాల నిర్వహణపై గురువారం అవగాహన కల్పించారు. రోజుకు రెండు పంచాయతీల్లో అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. ఈనెల 23వ తేదీ వరకు కార్యక్ర మం కొనసాగుతుందన్నారు. బీఎస్‌వై టీం సభ్యులతో పాటు సర్పంచ్ ఎం.దుర్గాప్రసాద్, కార్యదర్శి పి.శిరీష పాల్గొన్నారు.

క్లుప్తంగా..

సంక్రాంతి తర్వాతే లైఫ్ సర్టిఫికెట్

బెలగాం: పార్వతీపురంలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ భవనంలో సబ్ ట్రెజరీ పరిధిలోని వారికి లైఫ్ సర్టిఫికెట్లు ఈనెల 13 నుంచి 16 వరకు నిలుపుదల చేసినట్టు పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి డి.గణపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ సెలవుల తర్వాత సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పారు.

కోడి పందేలపై దాడి

గరుగుబిల్లి: కోడి పందాలపై పోలీసులు నిర్వహించిన దాడుల్లో రెండు కోడి పుంజులతో పాటు ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి ట్రైనీ డీఎస్పీ అజీజ్ అందించిన వివరాల ప్రకారం.. సన్యాసిరాజుపేట గ్రామ సమీపంలో గురువారం కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు అందించిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామని చెప్పారు. ఈ దాడుల్లో కోడిపుంజులతో పాటు ఎనిమిది మందిని పట్టుకుని అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో స్థానిక ఎస్ఐ వై.అమ్మనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పార్వతీపురంలో రౌండ్ టేబుల్ సమావేశం

గరుగుబిల్లి: పార్వతీపురంలోని భాస్కర్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ప్రజాస్వామ్యం, రాజకీయ రిజర్వేషన్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ధర్మ పక్షం ప్రతినిధి డి.పారినాయుడు తెలిపారు. ఆయన గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ప్రస్తుత సమాజంలో నెలకొన్న అంశాలపై చర్చిస్తామని చెప్పారు. పార్వతీపురానికి చెందిన చుక్క భాస్కరరావు ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

టీడీపీ కార్యకర్తలకు కృతజ్ఞతలు

గుమ్మలక్ష్మీపురం: బొబ్బిలి గర్జనను విజయవంతం చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు కురుపాం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి తెలిపారు. ఆమె గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున సభకు తరలిరావడంపై సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ విజయానికి కృషిచేయాలని కోరారు.

శ్రీరాముడు అక్షింతల పంపిణీ

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అయోధ్య రాముడు పవిత్ర అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. దళాయివలస శ్రీరామ భజన సేవా మండలి ఆధ్వర్యంలో భజన మండలి సభ్యులు ఊరేగింపు నిర్వహించి, పంపిణీ చేశారు.


అక్షంతలను ఊరేగిస్తున్న దృశ్యం

సాయినాథునికి విశేష పూజలు

సాలూరు రూరల్: మార్గశిర మాస అమావాస్య గురువారం కావడంతో సాలూరులో షిర్డీ సాయినాథునికి విశేష పూజలు చేశారు. పాలాభిషేకం, నారికేళ అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు, తదితర పూజా కార్య క్రమాలను నిర్వహించారు.


పూజలందుకుంటున్న సాయినాథుడు









